# ఆమెరికా

- ఇచ్ఛాపురపు రామచంద్రం

"మీ ఫ్రెండ్ మాలతి కొడుక్కి ఉద్యోగమొచ్చిందట–"

"అలాగా! ఐతే వెళ్లి ఆమె నభినందించాలి. ఇంతకీ ఏం ఉద్యోగం? ఎక్కడ?"

"గవర్నమెంటు జాబేట. ప్రారంభ జీతమే పదిహేను వేలు. ఢిల్లీలోట–"

"చాలా దూరమే..."

"ఉద్యోగికి దూరమే లేదన్నాడు సుమతో మరెవరో. ప్రపంచమే గ్రామంగా కుదించబడుతున్న ఈ గ్లోబలేజిలో దూరమేమిటి? నువ్వెళ్లినప్పుడు నా అభినందనలు కూడా అందించెయ్. అన్నట్లు ఆర్టీసీ సమ్మె కదా... ఎలా వెళ్తావు?"

"ఆఫీసుకెళ్తూ, నన్ను డ్రాప్ చేసి వెళ్దురుగాని. అభినందనలెప్పుడూ అర్జంటుగానే చెప్పాలి. ఒకవైపు వీఆర్ఎస్‌లూ, రిట్రెంచ్‌మెంటులూ, ఎంప్లాయిమెంటు మీద బ్యాన్‌లు ఉన్న ఈ రోజుల్లో అదర్ క్యాస్ట్‌కి గవర్నమెంట్ జాబ్ రావడమంటే ఈ దేశంలో ఎనిమిదో వింతే. తక్షణాభినందనలకి తగిన అవకాశం."

"వాళ్లిచ్చే స్వీట్లన్నీ నువ్వొకత్తెవే తినేయకు. వొళ్లొచ్చేస్తుంది. నాకూ కొన్ని పట్రా."

"నా వొళ్లు బరువెక్కితే నేననుభవిస్తా నా బాధ. సరే కానీ తొందరగా తెమలండి. నన్ను డ్రాప్ చెయ్యడమనే అదనపు పని ఉంది మీకు. నేను తిరిగి రావడం గురించి మిమ్మల్నిబ్బంది పెట్టనులెండి. ఏదో చేస్తాను." అంది భానుమతి తను కూడా తయారవుతూ. నిజానికి మాలతికీ, ఆమెకీ పరిచయమే తప్ప గాఢమయిన స్నేహమేమీ లేదు. ఆర్నెల్లకో, ఏడాదికో ఏ ఫంక్షన్‌లోనో, పిక్నిక్‌లోనో కలుసుకుంటారంతే.

భానుమతి వెళ్లేసరికి మాలతి ఇంట్లో ఆనందమూ హడావిడీ పొంగిపొరలడం లేదు సరికదా– సీను పూర్తి విరుద్ధంగా ఉంది. ముఖం– జబ్బు చేసినట్లుండడమే కాక మాలతి మంచం మీద పడుకుని ఉంది. పైకప్పు చూస్తూనూ, నిట్టూర్చుతూనూ. కొడుక్కి ఉద్యోగమొచ్చిన ఇల్లులా కాక– శవం లేచిన కొంపలా ఉంది అక్కడ.

"మీ అబ్బాయికి ఉద్యోగం వొచ్చిందని విన్నాను" సందేహిస్తున్నట్లు మెల్లగా అంది.

"వొచ్చింది– బోడుద్యోగం" కస్సుమంది మాలతి.

"గవర్నమెంటు జాబేనటగా. పదిహేను వేలు జీతమట. మరెందుకలా దిగులుగా ఏదో పోగొట్టుకున్నట్లున్నారూ? ఓహో! మిమ్మల్ని వొదిలి కొడుకు దూరంగా వెళ్లిపోతాడనా?"

"దూరంగా వెళ్లలేదనే"–

"అంటే?" అర్థంకానట్లు చూసింది భానుమతి.

"అమెరికా వెళ్లాలని కలలు కంటే– ఢిల్లీ వరకే వెళ్లగలుగుతున్నాడు– ఆటంబాంబు తుస్సుమన్నట్లు."

"అదా! పోన్లెండి. ఇదీ ఒకందుకు మంచిదే. కొడుకు దేశంలోనే ఉంటే అప్పుడప్పుడు చూడొచ్చు. ఐనా.. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా కంటే మనదేశమే నయం. టెర్రరిస్టులు ప్రపంచ వాణిజ్య సంస్థ భవనాలనీ, పెంటగాన్‌నీ కూల్చేయడం, ఆంత్రాక్స్... వీటితో అక్కడి ప్రజలు ప్రాణాలను చేతుల్లో పెట్టుకుని బితుకు బితుకుమంటూ భయంగా బతుకుతున్నారట. మనదేశం..."

"మనదీ ఒకదేశమేనా! దరిద్రగొట్టు దేశం. ఏనుగు చచ్చినా బతికినా వెయ్యి వరహాలే అన్నట్లు బతికినా, చచ్చినా అమెరికాయే ఘనం. ఇక్కడ–



ఇండియాలో మంచి జీవితమూ లేదు, మంచి మరణమూ ఉండదు."

భానుమతి నిర్ఘాంతపోయిందా మాటలకి. మాతృదేశం ముష్టి దేశం! ఇక్కడి బతుకు దరిద్రం. ఇలాగ – మునుపు – అమెరికా వెళ్లిన భారతీయులనే వారు. ఇప్పుడు అమెరికా వెళ్లకుండానే అంటున్నారు!

"వాడిని అమెరికా పంపేందుకెన్ని త్యాగాలు చేశాం. ఎన్ని కష్టాలు పడ్డాం. ఒక్క సంతానంతోనే ఆపెయ్యడం కూడా– వాడిని ఘనంగా పెంచాలనీ, ఎంత డబ్బయినా ఖర్చుపెట్టి అమెరికాకు పంపగల చదువు చదివించాలనే. వాడు రూపాయల నికృష్టపు బతుకు కాకుండా డాలర్ల ఘన జీవితం గడపాలనీ... మా అబ్బాయి అమెరికాలో ఉన్నాడని చెప్పుకోవాలనీ ఎన్నెన్ని కలలు కన్నాం! అవన్నీ కల్లలే అయ్యాయి. ఇప్పుడు మేమెలా ముఖమెత్తుకోగలం?" ఆపుకోలేనట్లు భోరున ఏడిచేసింది మాలతి.

అభినందించడానికని వచ్చిన తనకి ఓదార్చవలసిన పరిస్థితి ఎదురయిందేమిటా అని ఆశ్చర్యపోతూనూ, విచారిస్తూనూ– "మీ వాడెందుకు వెళ్లలేకపోయాడూ?" అని అడిగింది.

"మా ఖర్మకొద్దీ– వాడి టైముకే వీసా నిబంధనలు స్ట్రిక్టయిపోయాయి. ముఖ్యంగా ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లేవారి విషయంలో..." అని మళ్లీ ఏడవసాగింది.

ఏదో ఒకటనకపోతే బాగుండదని– "గుడ్డి కంటే మెల్ల నయమే. నిరుద్యోగ రక్కసి దేశాన్ని శతవిధాల కబళించేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో మీ వాడికి ఇక్కడైనా మంచి జాబ్ రావడం ఘనమయిన సంగతే. సంతోషించవలసిందే..."

"నా మొహం. ఇదీ ఓ జాబేనా? ఇండియాలో జాబ్..." వెక్కి పడింది మాలతి.

మర్యాద (కర్టెసీ) కోసం వొచ్చిన భానుమతి అక్కడ ఇక ఉండలేకపోయింది. ఆమెకి విదేశీ వ్యామోహం లేకపోవడమే కాక కొంచెం దేశభక్తి కూడా ఉంది.

అందంగా లేకపోయినా... తెలివితేటలు లేనిదయినా... ధనవంతురాలు కాకపోయినా... అమ్మ అమ్మే. అలాగే మాతృదేశమూను. మాలతి ధోరణి భరించలేక ఆమె ముందునుంచి దొంగలా జారుకుని – బయటకొచ్చి – బస్ షెల్టర్ చేరుకుంది. అక్కడ–

పనసకాయ దొరికితే తద్దినం పెట్టకుండా

వొదలకూడదన్నట్లే, జనం దొరికితే సిద్ధాంతోప న్యాసం ఇవ్వకుండా వదలరాదని నమ్మిన వామపక్షీయుడెవరో ధాటిగా జనాలకు స్పీచిస్తు న్నాడు. ప్రత్యామ్నాయ వాహన సౌకర్యం కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీక ప్రజ వింటున్నారు- పనిలో పనిగా.

"గ్లోబల్ విలేజ్ మరేదో కాదు. అమెరికాయే. పెట్టుబడిదారీ విధానాన్నీ, తన మార్కెట్‌నీ పెంచుకుందుకు అమెరికా ఎన్ని రకాలుగా మాయాజాలాలు పన్నుతూందో! అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల ద్వారా, సబ్సిడీల ద్వారా అప్పులిస్తూ ఆర్థికంగానూ, టెర్రరిస్టులను ఆ దేశాల మీదకు ఉసికొల్పి, ప్రపంచ పోలీస్‌లా వ్యవహరిస్తూనూ, రాజకీయంగానూ, బ్యూటీ కాంటెస్ట్‌లు, టీవీ ఛానెల్స్ ద్వారా సాంస్కృతికం గానూ, మల్టీ నేషనల్ కంపెనీల ఉత్పత్తులను అత్యధిక ప్రచారంతో ప్రపంచమంతా విర జిమ్ముతూ వ్యాపారపరంగానూ, చాపకింద నీరులా కాక ఉప్పెనలాగే అమెరికా భారతదేశంతో సహా ఎన్నో దేశాలను రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా లోబరచుకుంటోంది. గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్‌లు... కన్స్యూమరిజం... ఇవన్నీ అందుకే. వీటి ప్రభావం వల్లనే మన బతుకులు రోజురోజుకీ అస్తవ్యస్తమైపోతున్నాయి. ఆర్టీసీని కూడా ప్రైవేటైజేషన్ చేయడానికే - కుట్రపన్ని - సమ్మెను పరిష్కరించకుండా తమాషా చేస్తోంది ప్రభుత్వం. కామ్రేడ్స్! ప్రైవేటైజేషన్ మీద భ్రమలు మానుకోండి. ఇంతవరకూ ఎన్నో దశాబ్దాలుగా బస్సులు ప్రైవేటు వారి అధీనంలో ఉంటూ వచ్చినా- ప్రయాణీకులకు షెల్టర్లు... సుఖంగా నిరీక్షించేందుకు ఆర్టీసీ స్టేషన్‌లు... కాంప్లెక్సులు... ఇవి- బస్సులు ప్రభుత్వ రంగంలోకి వచ్చాకే వచ్చాయన్న నిజం గుర్తించండి. ప్రైవేటు వైపు పెట్టుబడి పెడుతూండడం వల్లనే ఈనాడు విద్య కానీ, వైద్యం కానీ సామాన్యుడికి అందనంత ఖరీదయిపోయాయని గ్రహించండి. అమెరికా మన ఆలోచనలని కూడా కొల్లగొట్టేస్తూంది. అందుకే మన వాళ్లందరికీ అమెరికాయే భూతల స్వర్గం. అదే మన లక్ష్యమూ, గమ్యమూ.

మన రోడ్లు ప్రపంచ బ్యాంకువి. మన బ్రిడ్జిలు ఐ.ఎం.ఎఫ్.వి. మనం అమెరికా కీలుబొమ్మలం. మన ఆలోచనలు... కలలు... కోరికలు... జీవితం... అన్నీ అమెరికాయే అయిపోతోంది. అమెరికా మొగుడు... అమెరికా ఉద్యోగం... యువతీ యువకుల ధ్యేయాలయిపోతున్నాయి. ఈ భావ దాస్యం వొద్దు భారతీయులారా...

అప్పుడే- తను వెళ్లవలసిన వైపు స్టీరింగ్ ఆటో రాగా- ఎక్కేసింది భానుమతి, అతని ఉపన్యాసం ఇంకా వినాలని వున్నా. ఆమె మనసులో మాలతే మెదిలింది. అమెరికా పిచ్చిది- అని నిట్టూర్చింది జాలిగా.

---

ఈ మధ్య హైదరాబాద్‌లో యానిమేషన్ కంపెనీలు సంక్షోభంలో చిక్కుకున్న విషయం అందరికీ తెలిసిందే! అయినప్పటికీ ఓ పత్రికా విలేఖరి అత్యుత్సాహంతో యానిమేషన్ రంగం భవిష్యత్‌లో అద్భుతంగా వుంటుందని ఆర్టికల్ రాసి "యానిమేషన్ రంగంలో పుంజుకుంటున్న హైదరాబాద్" అని చక్కని హెడ్డింగ్ పెట్టాడు. ఆ పత్రిక చూసిన కార్టూనిస్ట్ మోహన్ హెడ్డింగ్‌లో చిన్న సవరణ చేశారు. "యానిమేషన్ రంగంలో 'గింజుకుంటున్న' హైదరాబాద్!".

-శ్యాంమోహన్

